క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో ఆర్థిక సాయం కోసం వెంకటమ్మ కుటుంబ సభ్యులు పెద్దపల్లి జెడ్పీచైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట మధును కోరారు. దీంతో పుట్ట మధు ప్రభుత్వం నుంచి రూ.2.50లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఈమేరకు మధు వ్యక్తిగత సహాయకుడు ద్వారా నిమ్స్ ఆస్పత్రిలో వెంకటమ్మకు మంగళవారం ఎల్‌ఓసీ పత్రాన్ని అందించారు.

సభలకు తరలిన నాయకులు

భూపాలపల్లి రూరల్: మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో నేడు, రేపు బెంగుళూరులో నిర్వహించనున్న జాతీయ మహాసభలకు మంగళవారం జిల్లా కేంద్రం నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు తరలివెళ్లారు. అంబాల చంద్రమౌళి, గట్ల రాజన్న, బట్టు విజయ్, తదితర నాయకులు వెళ్లారు.

శబరిమలకు అయ్యప్ప మాలధారులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో అయ్యప్పమాలధారులు శబరిమలకు బయలుదేరి వెళ్లారు. మంగళవారం స్థానిక ఆలయంలో మాలధారులు పూజలు నిర్వహించారు. పూజలో సర్పంచ్ మోటే ధర్మరావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాలధారులు సాంబమూర్తి, కిరణ్‌గౌడ్, రుషింద్ర, రఘువరన్‌చారి, వేముల నిఖిత్ పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

మొగుళ్లపల్లి: జనవరి 1వ తేదీన కరీంనగర్‌లో జరిగిన షూటింగ్ బాల్ క్రీడల సెలక్షన్‌లో జిల్లా నుంచి 20మంది పాల్గొనగా మొట్లపల్లి గ్రామానికి చెందిన సీనియర్ విభాగంలో యా.శ్రావణి, జూనియర్ విభాగంలో 8వ తరగతి చదువుతున్న గున్నారపు దివ్య, 9వ తరగతి చదువుతున్న జె.సిద్ధులు ఎంపికైనట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సాంబయ్య, ప్రధాన కార్యదర్శి గుండెపల్లి రాజయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు సర్పంచ్ పద్మనరహరి, వెంకట్ రెడ్డి చెరో రూ.500 అందజేసి అభినందించారు.

దాడి కేసులో ఒకరి అరెస్ట్

మహదేవపూర్: మండల కేంద్రంలో సోమవారం రాత్రి పాత కక్షలతో కత్తితో దాడి చేసిన సంఘటనలో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆకుల రామదాసు బెగుళూర్ గ్రామానికి చెందిన ఆకుల మొండయ్యకు కొంత కాలంగా గొడవలు ఉన్నాయి. ఈ పాత కక్షల కారణంగా రామదాసుపై మొండయ్య కత్తితో దాడి చేసినట్లు తెలిపారు. రామదాసు అన్న శ్రీధర్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి మొండయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు వెల్లడించారు.

పోలీసుల తనిఖీ



వెంకటాపురం (కె) : మండలంలోని చొక్కాల గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై ఎస్సై సురేశ్ ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. మండలానికి భద్రాచలం, చర్ల మండలాల నుంచి వస్తున్న, వెళ్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితుల పూర్తి వివరాలు సేకరించి విచారించి వదిలేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. వాహన చోదకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం



మంగపేట : భూసంబంధిత సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎంపెల్లి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కత్తిగూడెం, వాడగూడెంలో మంగళవారం నిర్వహించిన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. కత్తిగూడెంలో 20, రమణక్కపేటలో 3 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈనెల 11 (బుధవారం) కత్తిగూడెం, ఆకినేపల్లి మల్లారం గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. దరఖాస్తులపై విచారణ చేపట్టి ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరిస్తామని తెలిపారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరవేయాలి



కాటారం: లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కాటారం: ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికార యంత్రాంగం కృషి చేయాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయడం బాధ్యతగా భావించి విధులు నిర్వర్తించాలని అధికారులకు సూచించారు. పథకాలు ప్రజలకు చేరవేయడంలో ఎలాంటి జాప్యం వహించదని పేర్కొన్నారు. అంతకముందు స్థానిక శ్రీ ఆనందధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మాలాధారణ స్వాములకు ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మాలాధారణ స్వాములతో కలిసి భిక్ష చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, తహసీల్దార్ జీవాకర్‌రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి కుంభం స్వప్న, ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, ఎంపీటీసీ మహేశ్ రవీందర్ రావు, సర్పంచ్‌లు తెప్పెల దేవేందర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, అంగజాల అశోక్, రఘురాం, నరేశ్, యూత్ డివిజన్ కార్యదర్శి కడారి విక్రమ్, బోడ నరేశ్, గడవేణ దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకోవాలి

మల్హర్: కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించడంలో అధికారులు, సిబ్బంది వసూళ్లకు పాల్పడినట్లు దృష్టికి వస్తే చర్యలు తీసుకోవాలని మంథని ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి శ్రీధర్‌బాబు తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో మండల వ్యాప్తంగా మంజూరైన 29 కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందించడానికి కార్యాలయంలో సిబ్బంది డబ్బులు డిమాండ్ చేసినట్లయితే తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని గ్రామస్తులకు సూచించారు. లబ్ధిదారులకు చెక్కులు జారీ చేసే విషయంలో సంబంధిత ప్రజాప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, సర్పంచ్‌లు రాజునాయక్, రమేష్, విజయ ఆర్‌ఐ సరిత, ఏఎస్‌ఓ శివ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి



పిల్లల ఎత్తును చూస్తున్న స్పెషల్ ఆఫీసర్ శైలజ

చిట్యాల: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ శైలజ అన్నారు. మంగళవారం మండలంలోని జూకల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రీస్కూల్ కార్యక్రమాలు ప్రతి రోజు సెలబస్ ప్రకారం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతల రికార్డు ప్రకారం నమోదైన వారందరూ ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేయాలన్నారు. అనంతరం పిల్లల బరువు ఎత్తు చూసి లోప పోషణను గుర్తించి తల్లులకు అవగాహన కల్పించారు. ఆమె వెంట సర్పంచ్ పుట్టపాక మహేందర్, ఉప సర్పంచ్ అనంద్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు కరుణాదేవి, సరిత తదితరులు ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కాటారం: మండల కేంద్రంలోని గారెపల్లి శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు చేయూతనందిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన చీమల రాజయ్యపటేల్ పద్మ దంపతులు రూ.50,116 విరాళంగా ఆలయ కమిటీకి మంగళవారం అందజేశారు. విరాళాలు ఇచ్చిన రాజయ్య పద్మ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొట్టె శంకరయ్య, జక్కు మొగిలి, కొట్టె ప్రభాకర్, కొట్టె శ్రీహరి, పసుల రాంచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

నేతకాని హక్కుల సాధనే లక్ష్యం



భూపాలపల్లి రూరల్: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కాటారం: నేతకాని హక్కుల సాధనే లక్ష్యంగా ఈ నెల 22న ఎన్టీపీసీ రామగుండంలో నిర్వహించతలపెట్టిన నేతకాని మహా ఆత్మీయ సమ్మేళనానికి నేతకాని కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ప్రోగ్రాం కన్వీనర్లు దుర్గం గోపాల్, ఆర్‌కే నేతకాని, దుర్గం రాజేశ్, కళాలి నర్సయ్య కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం సమ్మేళనం పోస్టర్‌ను నేతకాని కులస్తులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేతకాని సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటం అవసరమన్నారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేశ్‌నేత, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కులసంఘ నాయకులు, పెద్దలు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొండగొర్ల గట్టయ్య, గాలి సద్వలి, మేడిగడ్డ దుర్గారావు, గంట సమ్మయ్య, గజ్జెల రాజయ్య, కొండ తిరుపతి, రజాకర్, లింగమూర్తి, దుర్గయ్య, సత్యం, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.



కాటారంలో..

విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్: పెద్దపల్లిజిల్లా రామగుండంలో ఈనెల 22న నిర్వహించే నేతకాని మహాఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం సీనియర్ నాయకుడు సెగ్గం సిద్దు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో మహా ఆత్మీయ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం సంఘం నాయకులు దుర్గం రాజేష్, నర్సయ్య, రాయమల్లు, కమలాకర్, బెద్దలపోషయ్య, అశోక్, రామయ్య పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు ప్రభుత్వ పాఠశాలలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భోజన విరామ సమయంలో 2023 క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం జిల్లా సీనియర్ నాయకులు దేవదాసు, సంఘం నాయకులు జయప్రకాశ్, లకోష్మిరెడ్డి, శంకర్ రావు, సునీత తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

చిట్యాల: చిట్యాల తహసీల్దార్‌గా నూతనంగా వచ్చిన సమ్మయ్యను తహసీల్దార్ కార్యాలయంలో నాయకులు మంగళవారం సన్మానించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దొడ్డి కిష్టయ్య, మండల అధ్యక్షుడు నేరెళ్ల ఓదేలు, మండల ప్రధాన కార్యదర్శి పర్లపెల్లి కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య తదిరులు ఉన్నారు.

మండల అధ్యక్ష పదవికి పోటా పోటీ

మహాముత్తారం: కాంగ్రెస్‌పార్టీ సంస్థాగత మార్పులో భాగంగా పార్టీ జిల్లా, మండల కమిటీలను రద్దు చేసింది. దీంతో నూతన కమిటీలో చోటుదక్కించుకునేందుకు నాయకులు పోటీ పడుతున్నారు. గ్రామ, మండలస్థాయి కమిటీలు నియమించేందుకు అదిష్టానం సిద్ధం కావడంతో మండల అధ్యక్ష పదవి వచ్చేలా ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీంతో మండలంలోని ఇద్దరు ప్రముఖ నాయకులు పోటా పోటీగా ఉన్నట్లు తెలుస్తుంది. పార్టీ సీనియర్ నాయకుడు మండలకేంద్రానికి చెందిన సింగిల్ విండో మాజీ చైర్మన్ ముక్కెర రాజమల్లుతో పాటు మండలంలోని నల్లగుంట మీనాజిపేట మాజీ సర్పంచ్ ఓలపు శంకర్‌పటేల్ మధ్య తీవ్ర పోటీ ఉన్నట్లు సమాచారం. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీదర్‌బాబు ఎవరిపై మొగ్గు చూపుతారనే దానిపై మండలంలో చర్చ జరుగుతోంది.

వైభవంగా గణపతిహోమం



గణపతిహోమంలో పాల్గొన్న జక్కు శ్రీహర్షిణిరాకేశ్ దంపతులు

కాటారం: సంకటహర చతుర్థిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ ఆనందధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం సామూహిక గణపతి హోమాలు వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో హోమగుండాలను ప్రతిష్ఠించి పురోహితులు వేదమంత్రోచ్చరణల మధ్య హోమం చేపట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేశ్ దంపతులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకముందు అయ్యప్ప స్వామికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. కాగా మొదటిసారి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక గణపతిహోమానికి విశేషస్పందన లభించింది. ఆలయంలో అయ్యప్ప స్వామి మాలాధారణ భక్తులకు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. 41రోజుల దీక్ష పూర్తి చేసుకున్న స్వాములు ఇరుముడి కట్టుకొని శబరియాత్రకు ప్రయాణమయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు బచ్చు అశోక్‌గుప్త, ఆలయ పురోహితులు గుండూరి భానుప్రసాద్, కృష్ణమోహన్‌శర్మ, గణేశ్‌శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు బచ్చు ప్రకాశ్, పీచర రామకృష్ణరావు, జక్కు మొగిలి, పెండ్యాల రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.



కాళేశ్వరం: పూజలు చేస్తున్న భక్తులు

విజయ గణపతికిపంచామృత అభిషేకం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ విజయ గణపతి ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు అర్చకులు కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు, భక్తులు ప్రత్యేకంగా పంచామృత అభిషేక పూజలు నిర్వహించారు.

మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 13, 14వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరిగే యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి శనిగరపు రమేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయ ఆవరణంలో మంగళవారం మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. మహాసభలలో విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చలు జరిపి వాటి నివేదికలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కేరళ రాష్ట్ర మాజీ ఆరోగ్యశాఖ మంత్రి శైలజ, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు, ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగువెల్లి నర్సిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. మహాసభలకు జిల్లాలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి దేవ, సెక్టోరియల్ అధి కారులు కిషన్‌రావు, లక్ష్మణ్, ఎంఎస్‌ఓ కరుణాకర్, తిరుపతయ్య ఈశ్వర్, రాజు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కాళేశ్వరం: పరామర్శిస్తున్న శ్రీధర్‌బాబు



టేకుమట్ల: పరామర్శిస్తున్న నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుటుంబ సభ్యులను మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీ దుర్గయ్య, నగేష్‌యాదవ్, కొంగొర్ల సంతోష్, దునే సమ్మయ్య పాల్గొన్నారు.

కాటారం: మండలంలోని ఒడిపిలవంచకు చెందిన పురుషోత్తం ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మంగళవారం పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న అదే గ్రామానికి చెందిన వడ్లకొండ మల్లేశ్, పొన్న లస్మక్కను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సర్పంచ్ కోడి రవికుమార్, మాజీ సర్పంచ్ నరోత్తంరెడ్డి, నాయకులు బాపు, పోచయ్య, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

టేకుమట్ల: మండలంలోని వెల్లంపల్లి, ద్వారకపేట గ్రామాలకు చెందిన కొలిపాక వెంకటమ్మ, పారనంది నర్సయ్యలు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి మంగళవారం పరామర్శించారు. వారి వెంట ఆయా గ్రామాల మిట్టపల్లి వనమ్మచంద్రయ్య, పారనంది భిక్షపతి, పాలశంకర్, వాసాల రవి, బొజ్జపెల్లి శంకర్ ఉన్నారు.

చిట్యాల వాసికి డాక్టరేట్

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన ఆరెపల్లి శ్రీనివాస్‌కు డాక్టరేట్ వరించింది. సేవాభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 16 సంవత్సరాలుగా చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన ఆసియా వేదిక్ కల్చరల్ రిసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీఓ వారు గౌరవ డాక్టరేట్ ప్రకటించారు. ఈ అవార్డును ఆసియా వేదిక్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తమిళనాడులోని హోసూరులో ఫిబ్రవరి 28న డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు యూనివర్సిటీ కో ఆర్డినేటర్, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీఓ ఫౌండర్ అండ్ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేశ్ తెలిపారు. ఆరెపల్లి శ్రీనివాస్‌కు డాక్టరేట్ రావడంపై పలు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులతో పాటు సంఘాల బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న కోటగిరి సతీష్‌గౌడ్

టేకుమట్ల: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్హులందరికీ ప్రభుత్వమే డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చలేకపోతుందని మండిపడ్డారు. అర్హులందరికి డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మిస్తామని చెప్పి మొదటి విడుతలో కొన్ని గ్రామాల్లో ఎంపిక చేసి వాటిని ఇప్పటికీ పూర్తి చేయలేదన్నారు. నేడు మరోమారు రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టేందుకు రూ.3లక్షలను అందిస్తామని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. రూ.మూడు లక్షలతో బేస్‌మెంట్ కూడా పూర్తి కాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్, మండల నాయకులు శాస్త్రాల కిరణ్, సంపత్, రమేష్, దయాకర్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

వెంకటాపురం (ఎం) : భవిష్యత్‌లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ములుగు ఎమ్మెల్యే సీతక్క తెలిపారు. కేంద్రంలోని బీజేపీ దేశంలోని ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుతోందని విమర్శించారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర నేపథ్యంలో ప్రధాని మోడీ ఓర్వలేకపోతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజాదరణ పెరుగుతోందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నారని విమర్శించారు. దళితులకు భూపంపిణీ, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పోడు భూములకు పట్టాలిస్తామన్న సీఎం హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు.

చైర్మన్ పదవిని ఎస్సీ, ఎస్టీకి కేటాయించాలి



మాట్లాడుతున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: కాళేశ్వరం దేవస్థాన చైర్మన్ పదవిని ఎస్సీ, ఎస్టీలకే కేటాయించాలని ప్రజా సంఘాల జేఏసీ నాయకుడు చేపూరి ఓదెలు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుజన వాదంపేరుతో మహిళా చైతన్య సదస్సులు నిర్వహిస్తున్న నాయకులు దేవస్థాన చైర్మన్ పదవిని ఎస్సీ, ఎస్టీ మహిళకు కేటాయించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పీక కిరణ్, అక్కల బాపు, సరస్వతి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

గండ్రను విమర్శించే అర్హత లేదు

మొగుళ్లపల్లి: ప్రజల కోసం పరితపిస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణను విమర్శించే అర్హత బీఆర్‌ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు క్యాతరాజు రమేష్ అన్నాడు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలో నిర్వహించిన దీక్ష విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ నాయకులకు మింగుడు పడడం లేదన్నారు. దీంతో పార్టీ మీటింగులు పెట్టి గండ్ర సత్యనారాయణపై లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గండ్రను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రావు, మహ్మద్ రఫీ, యూత్ ప్రెసిడెంట్ నీల రాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.